క్లుప్తంగా

ప్రమాదం జరిగితే.. ఎవరిది బాధ్యత!



అంగన్‌వాడీ అద్దె భవనానికి ఆనుకొని వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పార్వతీపురం రూరల్: మండలంలోని కొత్త పట్నం గ్రామంలో ఉన్న రెండవ అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తుండగా ఆ భవనానికి ఆనుకొని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎలాంటి రక్షణ కంచెగాని, గోడగాని ఏర్పాటు చేయకుండా ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిపోయే చిన్నారులు తెలియని పసితనంతో ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లి ఏదైనా తీగలు తాకితే విద్యుత్ ఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు, స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పు చేయాలని కోరుతున్నారు.

చెత్తతో సమస్య



వైకేఎం కాలనీ రహదారి పక్కన ఉన్న చెత్త నిల్వలు

పార్వతీపురం రూరల్: సకాలంలో చెత్త తరలించక పారిశుధ్య సిబ్బంది ఏర్పాటు చేసిన చెత్త తొట్టెలు నిండుగా ఉండి రోజుల తరబడి తరలించకపోవడంతో చుట్టుప్రక్కల ఆ చెత్త వ్యాపించి పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతూ చిన్నపాటి డంపింగ్ యార్డును తలపిస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త నిల్వలను తరలిస్తే ఈ ఇబ్బందులు ఉండవని వాపోతున్నారు. నిల్వ ఉండిపోతున్న చెత్తవల్ల పందులు, కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయని తెలిపారు.

కౌలు రైతు కార్డుల పంపిణీకి సహకరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలో కౌలు రైతుల కార్డుల పంపిణీకి వీఆర్‌వోలు, వ్యవసాయ సహాయకులు సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏవో ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో కౌలు రైతుల కార్డుల పంపిణీపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవసరమైన కౌలు ధ్రువపత్రాలు అందజేతకు సమష్టిగా పని చేయాలన్నారు. సమావేశంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంధకారంలో గిరిశిఖర గ్రామాలు

సాలూరు రూరల్: మండలంలోని సారిక పంచాయితీ సంపంగిపాడు పంచాయతీ డెన్సరాయి, గుంద్రగొయ్యి, సలపరబంధ, కాగురూడీ గ్రామాలతో పాటు ఆరు గ్రామాలకు మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఆ పంచాయతీ సర్పంచ్‌లు సత్యవతి, చంద్రయ్య తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్ చేసి సమస్య చెప్పిన పట్టించుకోవడం లేదని తెలిపారు. మూడు రోజులుగా విద్యుత్ లేకపోవడంతో తాగునీరు సమస్య కూడా ఎదుర్కొంటున్నారని వెంటనే విద్యుత్ శాఖ అధికారులు సరఫరా పునరుద్ధరించాలని కోరారు.

ఆషాఢం.. ఒక ప్రత్యేకం



ఉత్సవాలకు సిద్ధమవుతున్న జగన్నాథస్వామి

• పండుగలకు ప్రత్యేకం

బలిజిపేట:

ఆషాఢ మాసం ఎంతో విశిష్టం, ప్రత్యేకం. ఏకాదశి, గురుపౌర్ణమి, చాతుర్మాస వ్రతాలు, జగన్నాథస్వామి రథయాత్ర, అవతారాలు వంటివి ఎన్నో ఉత్సవాలకు ఈ మాసం ప్రత్యేకం. ఉత్సవాల మాట అలా ఉంటే నవ దంపతులకు మాత్రం ఎడబాటు తప్పదు. వారు శ్రావణం వచ్చే వరకు దూరంగా ఉండాల్సిందే. ఆషాఢ మాసం గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ మాసాన్ని శూన్యమాసం అంటారు. వివాహం లాంటి శుభ కార్యాలు తలపెట్టరు. ఈ మాసంలో అనేక పర్వదినాలు ఉన్నాయి. ఆషాఢ శుద్ధ ఏకాదశి వైష్ణవ ఆరాధకులకు ముఖ్యమైంది. దీన్నే తొలి ఏకాదశి అంటారు. అప్పటి నుంచి ప్రతి వారం ఏదో ఒక పండుగ, వ్రతం, పూజ ఉంటుంది. తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస వ్రతాన్ని ప్రారంభిస్తారు. వారాహి నవరాత్రి పూజలు ఆషాఢ మాసం తొలి రోజు నుంచే ప్రారంభమవుతాయి.

ఆషాఢంలో ప్రత్యేకతలూ ఉన్నాయి..

గోరింటాకు ప్రత్యేకం. ఆషాఢ మాసంలో యువతులు గోరింటాకు తప్పక పెట్టుకోవాలని పెద్దలు చెబుతుంటారు. గోరింటాకుకు మన సాంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉంది. జగన్నాథుని రథయాత్ర కూడా ఈ మాసంలోనే అత్యంత వైభవంగా నవరాత్రి ఉత్సవాలు జరుపుతారు. పల్లె ప్రాంతంలో జగన్నాథస్వామిని సాంప్రదాయ పద్ధతులలో గుడిశెన గుడి వద్దకు తీసుకువెళ్లి అక్కడ స్వామివారి అవతారాలు అలంకరించి పూజలు జరుపుతారు. ఆషాఢ పౌర్ణమిని వేదవ్యాసుని పేరిట గురుపౌర్ణమిగా నిర్వహించుకుంటారు. తెలంగాణాలో బోనాల పండుగ నిర్వహిస్తారు. వర్షాకాలం కావడంతో కూరగాయలు బాగా పండుతాయి. దుర్గామాతను శాకంబరీగా అలంకరించి తొమ్మిది రోజుల పాటు పూజలు జరుపుతారు.

ఉత్సవాల ప్రారంభానికి శుభసూచకం



ఆషాఢం శూన్యమాసం అయినా ఉత్సవాలు ఇక్కడ నుంచే ప్రారంభం అవుతాయి. జగన్నాథస్వామి ఉత్సవాలు, గురుపౌర్ణమి, ఏకాదశి పూజలు, చాతుర్మాస దీక్షలు ఈ మాసంలోనే జరుపుతారు. కొత్తకోడళ్ల అత్త వద్ద ఉండకూడదు అనేది సాంప్రదాయం.

– బ్రహ్మశ్రీ యర్ల రాంబాబు శాస్త్రి, జిల్లా అర్చక సంఘం గౌరవ అధ్యక్షులు

విరివిగా మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

సీతానగరం: మండలంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, టెక్నికల్ సహాయకులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన నీడనిచ్చే మొక్కలతో పాటు ఆదాయాన్నిచ్చే మొక్కలను నాటాలని కోరారు. ఏపీవో బాలకృష్ణ, జేఈ సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలు నాటేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. క్షేత్ర సహాయకులు మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జిరాయితీ భూములు ఉన్న వారికి జాబ్‌కార్డులుంటే వారికి మొక్కలు పంపిణీ చేయాలన్నారు. టెక్నికల్ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్‌లు పరిష్కరించాలని ఆందోళన



ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ నాయకులు ఎన్‌వైనాయుడు, రాముడు డిమాండ్ చేశారు. పురపాలక సంఘంలో సమ్మె చేస్తున్న కార్మికుల దీక్షా శిబిరానికి వెళ్లి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇంజినీరింగ్ కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కారం చేయాలని అన్నారు. 15 సంవత్సరాలు దాటిన కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని అన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కారం జరిగే వరకు ఐక్యంగా పోరాడాలని, అందుకు యూనియన్ పరంగా అండగా ఉంటామని పునరుద్ఘాటించారు. – సాలూరు

జగన్నాథస్వామి నేత్రోత్సవం



నేత్రోత్సవం అనంతరం జగన్నాథ, బలభద్ర, సుభద్ర మూర్తుల విగ్రహాలు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ కూడలి వద్ద గల అతి పురాతన జగన్నాథస్వామి వారి నేత్రోత్సవ కార్యక్రమాన్ని ఎండోమెంట్ ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు రవీంద్రపండా, శశిభూషణ పండాలు జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవీ దేవాత మూర్తులకు ప్రత్యేక అర్చనలు చేశారు. ప్రతీ ఏటా రథయాత్ర సందర్భంగా నేత్రోత్సవ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అర్చకులు తెలిపారు. నేడు నిర్వహించనున్న రథయాత్ర మహోత్సవం సందర్భంగా ఉత్సవ మూర్తులను తరలిస్తున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం 11కేవీ ద్వారా విద్యుత్ సరఫరా జరిగే గ్రామాలకు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ పునరుద్ధీకరణ పనులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ రామారావు గురువారం తెలిపారు. ఈ మేరకు సంబంధిత గ్రామస్తులు సిబ్బందికి సహకరించాలన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



బాలగుడబలో చెత్త సేకరణ పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

పార్వతీపురం రూరల్: మండలంలోని 20 గ్రామ సచివాలయాల్లో పారిశుధ్య కార్యక్రమాలు జోరుగా నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో రమణమూర్తి తెలిపారు. మండలంలోని బాలగుడబ గ్రామంలో జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణ, వీధుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన స్థానిక కార్యదర్శితో కలసి గురువారం పరిశీలించారు. గ్రామాల్లోని పారిశుధ్య సిబ్బంది ప్రతీ ఇంటి నుంచి ప్రజల ద్వారా తడి చెత్త, పొడి చెత్త సేకరించాలని, దీనిపై సంబంధిత పంచాయతీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈయన వెంట కార్యదర్శి వెంకటనాయుడు, సర్పంచ్ పోలమ్మ, సూర్యనారాయణ, పండు తదితరులున్నారు.

నిలిచిన ట్రాఫిక్



మన్యం జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం ప్రధాన రహదారిపై సుమారు 20 నిమిషాల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా యంత్రాంగం నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అయితే ప్రధాన రహదారిలో రెండు వైపులా రాకపోకలను నిలిపివేయడం, అదే సయంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రావడం ఆలస్యం కావడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. – పార్వతీపురం రూరల్

9న దేశ వ్యాప్త సమ్మె



బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన జీపు జాతాలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం:

జూలై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జీవీ రమణ పిలుపునిచ్చారు. దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న జీపుజాతా పార్వతీపురం పట్టణంలోని పాత బస్‌స్టాండ్‌కు గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తరువాత కార్మిక వర్గానికి, రైతాంగానికి తీవ్రనష్టం చేకూర్చే అనేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. 46 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చేలా పావులను కదుపుతుందన్నారు. ధరల పెరుగుదలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు వ్యవసాయానికి దూరంగా పోయే పరిస్థితిని తీసుకొస్తున్నారన్నారు.

ఈ సమ్మె ద్వారా ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బివి.రమణ, ఆర్.వేణు, ఆర్.రాము, బి.లక్ష్మి, అంగన్‌వాడీ నాయకులు రాజేశ్వరీ, గౌరీ మణితోపాటు ఆశావర్కర్స్‌ల రైతు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జి రహదారి అధ్వానం



చింతలవలస పామాయిల్ కాటా దగ్గరలో అధ్వానంగా బూర్జివలస రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని కొట్టుపరువు పంచాయతీ బూర్జివలస రహదారి పెద్దపెద్ద గొయ్యిలతో ప్రమాదకరంగా తయారైంది. చింతలవలస అడ్డు రోడ్డు నుంచి మావుడి అడ్డురోడ్డు వరకు బూర్జివలసకు వెళ్లే రోడ్డు గోతులమయం కావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలోనే పామాయిల్ కాటా ఉండటంతో నిత్యం పామాయిల్ రైతులు పామాయిల్ లోడ్లతో ట్రాక్టర్లు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రోడ్డు గోతులు రైతులు కొంతవరకు కప్పుకున్నారు. కనీసం పెద్దగా ఉన్న గొయ్యిలైనా కప్పాలని ఈ ప్రాంత రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కలగానే.. మావుడి కొత్తూరుకు రహదారి



బీటీ రోడ్డు వేయాల్సిన మావుడి కొత్తూరు రహదారి

సాలూరు రూరల్: మండలంలోని మావుడి రోడ్డు నుంచి మావుడి కొత్తూరుకు రూ.145 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి గత ఏడాది మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ సమీపించడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఇంతవరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించలేదు. ఈ విషయమై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన రోడ్డు నిర్మాణం చేయడం లేదు గాని, కొత్త రోడ్డు మంజూరు చేసి రహదారుల పండుగ చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం శోచనీయమని ప్రజలు గుసగుసలాడుతున్నారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను
తనిఖీ చేసిన పీవో

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలోని జీడీ పప్పు ప్రాసెసింగ్ యూనిట్, మండల స్థాయి నిత్యావసర సరుకుల గోదామును ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములో జీడిపప్పు ప్రాసెసింగ్ కొరకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. జీడి పిక్కలను స్టాక్ మేరకు రిజిష్టర్లలో నమోదు చేసే ప్రక్రియను తనిఖీ చేశారు. జీడి ప్రాసెసింగ్ పక్కాగా జరగాలని, వీడీవీకేలు నిర్వహించుకునేలా శిక్షణ ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తొలిత పట్టణంలోని నిత్యావసర సరుకుల మండల స్థాయి గోదామును సందర్శించి, అక్కడి రిజిస్టర్లను, స్టాక్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఆయన వెంట ఐటీడీఏ ఏపీడీ ఎ.మురళీధర్, ఇతర అధికారులు ఉన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

మక్కువ: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద వామపక్ష నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ గతంలో భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. శంబర గ్రామంలో గిరిజనులు, దళితులకు ప్రభుత్వం అందించిన డీ పట్టా భూములను పెత్తందారులు ఆక్రమించి దున్నుతున్నారని ఆరోపించారు. తూరుమామిడి గ్రామంలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ షేక్ ఇబ్రహింకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్, పిట్ట సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు..



సీతానగరం: హనుమాన్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీస్ అధికారులు



బలిజిపేటలో ర్యాలీ చేస్తున్న ఎస్‌ఐ సింహాచలం, విద్యార్థులు



పార్వతీపురం టౌన్: మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ ఏఈఎస్ జీవన్‌కిశోర్, సిబ్బంది

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పలువురు అధికారులు సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమాల్లో ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులు, పలు శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సాలూరు: పట్టణంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

జీడి పిక్కలతో జీవనోపాధి



రావికోనలో జీడి పిక్కలు వలుస్తున్న గిరిజన మహిళలు, పురుషులు



వలిచిన జీడి పప్పు సేకరిస్తున్న మహిళలు

పార్వతీపురం రూరల్:

తమ ప్రాంతంలో ఉపాధి అవకాశం లేని గిరిజనులకు చిన్నపాటి పనులు సమకూర్చుకుంటూ వారి ప్రాంతాల్లోనే ఉపాధిని పొందే విధంగా అక్కడ ప్రజలు కార్యాచరణ చేసుకుంటున్నారు. మహిళలు, పురుషులు జీడి పిక్కలతో రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు సంపాదించుకొని తమ కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. వారే రావికోన గిరిజనులు వివరాల్లోకి వెళ్తే...

పార్వతీపురం మండలంలోని రావికోనలో ఉన్న గిరిజన మహిళలు, పురుషులు జీడి పిక్కలను వలిచేందుకు మూడు కేజీల తడిపిక్కలకు రూ.100ల చొప్పున ఆర్జిస్తున్నారు. ఈ మేరకు సగటు రోజున పురుషులు 15కేజీలు చొప్పున మహిళలు 10కేజీల చొప్పున తడి జీడి పిక్కలు వలచి ఉపాధిని సమకూర్చుకుంటున్నారు. అయితే వీరికి పట్టణంలోని కొందరు వ్యాపారులు ఎండు జీడి పిక్కలు ఇచ్చి వాటిని నానబెట్టి, నానిన జీడి పిక్కలను వలచి పచ్చి జీడి పప్పుగా తయారు చేయాలని చెబుతున్నారు. ఈ మేరకు వారికి వలిచేందుకు ఈ విధంగా డబ్బులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలు లేకనే..

గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సరైన ఉపాధి అవకాశాలు లేక వారి జీవనం కష్టతరం అవుతుంది. ప్రభుత్వం నుంచి గిరిజనులకు ఉపాధి పొందే ప్రోత్సాహకాలు సక్రమంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇలాంటి గిరిజన గ్రామాలను గుర్తించి ప్రజలకు ఉపాధిని సమకూర్చాలి. రావికోనలోని మహిళలు, పురుషులు జీడిపిక్కలు వలుస్తూ అవస్థలు పడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ విధంగా ఉపాధిని సమకూర్చుకుంటున్నారు. ప్రభుత్వం ఇక్కడ దొరికే ముడుసరుకుతోగాని, వనరులతోగాని చిన్నపాటి పరిశ్రమలైన ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలి.

– సీపీఎం పార్టీ మండల అధ్యక్షుడు పి.రాము